ఇందానిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

వాంకిడి, ఏప్రిల్ 1: మండలంలోని ఇందాని గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నీటి ఏద్దటి సమస్యలు రాకుండా తగిన చర్యలు చేపడుతామ న్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ జబోరే పెంటు, వాంకిడి మాజీ సర్పంచ్ తుకారాం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు గుర్నులే మారుతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజం కోసం కృషి చేయాలి

మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు

సిర్పూర్(టీ), ఏప్రిల్ 1: కుష్టు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు సీతారామ్, సుధాకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని సిర్పూర్(టీ) సామాజిక దవాఖానను సోమవారం సందర్శించి, కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో కుష్టు వ్యాధి సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా కుష్టు వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. అదే విధంగా మండల పరిధిలోని 35 మందికి కుష్టు వ్యాధి స్క్రీనింగ్‌లు చేయగా, ముగ్గురికి పాజిటివ్‌గా తేలినట్లు తెలిపారు. అనంతరం వ్యాధి తీవ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎంవో శ్యాంలాల్, వైద్యులు నవత, అశ్విని, సహజ, సిబ్బంది సునిత, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువలో పడి యువకుడి మృతి

బెజ్జూర్, ఏప్రిల్ 1: మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన మురమురు ఉమేశ్ (25) అంబాడిగూడ సమీపంలోని ప్రాణహిత చేవెళ్ల కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమేశ్ కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలోని ప్రాణహిత చేవెళ్ల కాలువ సమీపంలో ఉమేశ్ బట్టలు, చెప్పులు విడిచి కనిపించాయి. మృతదేహం కాలువలో కనిపించినట్లు తెలిపారు. తల్లి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి ప్రసాదం.. ఇప్ప పువ్వు

విరబూసిన ఇప్పపూల వృక్షం

- పుష్కలంగా ఔషధ గుణాలు ఆరోగ్యానికి మేలు
- గిరిజన గ్రామాల ప్రజలకు వేసవి ఉపాధి

ఇప్పపూలు ఏరుతున్న స్థానికురాలు

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 1: గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు వారి జీవన శైలి, మనుగడ, సంస్కృతీసాంప్రదాయాలు నేటికీ మరిచిపోవడం లేదు. గుట్టలు, కొండలు, అటవీతోనే వారి జీవన గమనాన్ని కొనసాగిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా అటవీ విస్తీర్ణం పెరగగా, అటవీ సంపద గిరిజనులకు వరంగా మారుతున్నది. తునికి, పాల, మొర్రి, ఇప్పపువ్వు వృక్షాలు విపరీతంగా పెరిగి, వాటి ద్వారా గిరిజనులకు ఉపాధి దొరుకుతున్నది.

పెంచికల్ పేట్ మండలంలో..

పెంచికల్ పేట్ మండలంలోని మారుమూల గ్రామాలైన ఎర్రగుంట, కొండపల్లి, లోడ్పల్లి, మేరగూడ, గుండె పల్లి, కమ్మర్ గాం, నందిగాం, జిల్లేడ, మొర్లిగూడ ప్రజలు అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ప్రకృతి సహజ సిద్ధ ఇప్ప పూలు మార్చి, ఏప్రిల్ నెలల్లో పుష్కలంగా లభిస్తాయి. వీటిలో పోషక ఔషధ గుణాలు, వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. ఈ పూలు పచ్చివి, ఎండినవి కూడా తింటారు. ఇప్ప పూలు, బెల్లం ఉడకబెట్టి పాయసం, లడ్డూ రూపంలో ఆహారంగా తీసుకుంటారు. పుష్కలంగా ఔషధ గుణాలు ఉండడంతో మార్కెట్లో మంచి విక్రయాలు జరుగుతాయి. నిత్యం సేకరించిన ఇప్పపువ్వును ఎండబెట్టి మార్కెట్లో విక్రయిస్తారు. దగ్గర్లో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు లేవు. దీంతో పాటు సరైన మద్దతు ధర కూడ లభించదు. అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

గంపల్లో ఏరిన ఇప్పపూలు

ఇంట్లోనే ఆహారంగా ఉపయోగిస్తాం

వేసవిలో అడవిలో సహజంగా దొరికే ఇప్పపూలు రోజూ ఉదయం వెళ్లి ఏరుకొని వస్తాం. వాటిని ఆరబెడుతాం. ఇంట్లో వారంలో ఏదైనా ఒకరోజు ఉడకబెట్టి బెల్లం కలుపుకొని ఆహారంగా తీసుకుంటాం. ఆరోగ్యానికి మంచిదని మా పెద్దలు చెప్పిన్రు. తినడానికి రుచికరంగా ఉంటాయి.

-వనిత, జిల్లేడ

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

అటవీ ప్రాంత గ్రామాల్లో వేసవికాలంలో ఎక్కువగా ఇప్ప పూలు దొరుకుతాయి. కానీ వాటిని కొనేవారు లేరు. మద్దతు ధర కూడా ఉండదు. గిరిజన గ్రామాలపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కొన్ని గ్రామాలు కలుపుకొని కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మంచిగుంటది.

-సత్యక్క, మొర్లిగూడ

సంరక్షణతోనే అటవీ ఉత్పత్తులు

అటవీని సంరక్షించడంతోనే పండ్ల మొక్కలు ఏపుగా పెరిగి అటవీ ఉత్పత్తులను నేటికీ అందిస్తున్నాయి. అడవితో పాటు వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత. అటవీ సంపదను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకూడదు.

-సుధాకర్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో, పెంచికల్ పేట్

బాల్యవివాహం చేస్తే చట్టపర చర్యలు

- బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్

అసిఫాబాద్, ఏప్రిల్1: బాల్య వివాహం చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ హెచ్చరించారు. మండలంలోని పర్సనంబాల గ్రామంలో సోమవారం బాల్య వివాహం నిశ్చయించినట్లు ముందస్తు సమాచారం అందడంతో, కుటుంబ సభ్యులు, కుల పెద్దలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే ఎదరయ్యే చట్టపర, ఆరోగ్యపరమైన ఇబ్బందులను వివరించారు. ఆడపిల్లకు 18 ఏండ్లు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాన్ని లిఖితపూర్వకంగా వాయిదా వేయించినట్లు తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, గ్రామస్థాయిలో బాలల సంరక్షణ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఈఆర్ఎస్ఎస్ 112 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. బాల్య వివాహం చేస్తే చట్ట ప్రకారం ఇరు కుటుంబాల పై, వివాహాన్ని జరిపించిన పూజారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లాలోని పూజారులు ముందుగా వధూవరుల వయస్సును తెలుసుకొని ముహూర్తాలు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాల రక్షక భవన్ సిబ్బంది చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రవళి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

రిషికను సన్మానిస్తున్న అరిగెల నాగేశ్వర్‌రావు

విద్యార్థినికి సన్మానం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 1: జిల్లా కేంద్రంలోని హోలీ ట్రినిటి హైస్కూల్ విద్యార్థిని జాదవ్ రిషిక నవోదయ పాఠశాలకు ఎంపికవడంతో సోమవారం తన నివాసంలో జడ్పీటీసీ, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు శాలువాతో సన్మానించారు. రిషికను అభినందించారు. ఉత్తమ చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలు, తమ లక్ష్యాన్ని చేరుకోవాలని అకాంక్షించారు. ప్రిన్సిపాల్ ఎస్ నాగేంద్ర కుమార్, సిబ్బంది కోమల్ రాజ్‌పుత్, పిడుగు మహేశ్, ముషీర్ తదితరులున్నారు.

ఎన్నికలు నిర్వహించుకోవాలి

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తిర్యాణి, ఏప్రిల్ 1: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సూచించారు. మండలంలోని తలండి, పెరికపల్లి, నాయకపుగూడ గ్రామాల నుంచి కుమ్రం భీం చౌరస్తా వరకు సీఆర్పీఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులతో కవాతు నిర్వహించారు. ముందుగా సీఆర్పీఎఫ్ కమాండెంట్ రాకేశ్ జెండా ఊపి కవాతును ప్రారంభించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ సదయ్య మాట్లాడారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. శాంతియుత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. ఎలాంటి సమాచారమున్నా పోలీసులకు అందించాలని సూచించారు. సీఐ బద్రి ప్రసాద్, తిర్యాణి ఎస్ఐ సీహెచ్ రమేశ్, సిబ్బంది శంకర్, హోంగార్డు జంగు ఉన్నారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష.....

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 1: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం పరీక్ష ఈ నెల 7వ తేదీన (ఆదివారం) నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతులకు మధ్యాహ్నం 02 గంటల నుంచి 4 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. http://telanganams.cgg.gov.in/ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

పాస్‌పోర్ట్ పోయినది

నేను గుగ్లావత్ గబ్బర్‌సింగ్ తండ్రి గుగ్లావత్ వాల్వ, లింగాపూర్ గ్రామము: మం: మామడ జిల్లా: నిర్మల్ తెలంగాణ నా యొక్క పాస్‌పోర్ట్ నెం.M1859098 గల పాస్‌పోర్ట్ తేది: 08-03-2024 రోజున లింగాపూర్ గ్రామము నుండి మామడ మండలం బైక్‌పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు. ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయండి. సెల్ నెం: 90105 10664.

పాస్‌పోర్ట్ పోయినది

నేను బుక్క వినోద్ తండ్రి: మోతిలాల్ ఇ.నెం.4-47, గ్రా॥ తాటిగూడ, మం॥ పెంబి, జి: నిర్మల్, తెలంగాణ నా యొక్క పాస్‌పోర్ట్ నెం.K3639678 గల పాస్‌పోర్ట్ తేది:03-03-2024 రోజున మందపల్లి గ్రామం నుండి తాటిగూడ గ్రామానికి బైక్‌పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయండి. సెల్: 9347365255

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

సిర్పూర్(టీ), ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని సిర్పూర్(టీ) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఈవో రాకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరి ధాన్యం గ్రేడ్ (ఏ) రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ.2183 ను ప్రభుత్వం మద్దతు ధర కేటాయించినట్లు పేర్కొన్నారు. పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: గుంట్లపేట్‌లో ప్రారంభిస్తున్న ఆర్ఐ

దహెగాంలో ప్రారంభిస్తున్న అధికారులు

కౌటాల, ఏప్రిల్ 1: మండలంలోని గురుడుపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో యాసంగి సీజన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల కేంద్రంలో తహసీల్దార్ పుష్పలత సోమవారం ప్రారంభించారు. రైతులు ధాన్యంలో నాణ్యత పాటించి విక్రయించాలని సూచించారు. సహకార సంఘం సీఈవో బీ రాజేశ్, ఏవో పీ రాజేశ్, ఏఈవో ఘనశ్యాం, ఐఏపీ సీసీలు శంకర్, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ పుష్పలత

దహెగాం, ఏప్రిల్ 1: దహెగాంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పీఏసీఎస్ కార్యదర్శి చప్పిడ బక్కయ్య ప్రారంభించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో దహెగాంతో పాటు లగ్గాం, ఒడ్డుగూడ, గిరివెల్లి, చందప్రల్లి, కొంచవెల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది గురుజాల జీవన్, సాయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో సోమవారం ప్రాథమిక వ్యవసాయ శాఖ సహకార సంఘం గురుడుపేట ఆధ్వర్యంలో యాసంగి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సీఈవో రాజేశ్, రైతులు పాల్గొన్నారు.

పెంచికల్ పేట్, ఏప్రిల్ 1: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బెజ్జూర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ గోపాల్ అన్నారు. గుంట్లపేట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సెంటర్ నిర్వాహకులు సత్యనారాయణ గౌడ్, సిబ్బంది వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంల వద్ద కట్టుదిట్ట ఏర్పాట్లు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- కాగజ్‌నగర్‌లో స్ట్రాంగ్ రూం పరిశీలన

స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా స్ట్రాంగ్ రూంల వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణకు జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్ దోత్రే తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెటీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో సురేశ్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని సిర్పూర్ , ఆసిఫాబాద్ నియోజకవర్గాల పరిధిలో జరుగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. స్ట్రాంగ్ రూం వద్ద సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన సామగ్రి అంతా సిద్ధంగా ఉందని తెలిపారు.

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 1: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మంది రంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి విద్యాశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టాల్సిన మరమ్మతులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో 685 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి పాఠశాలల కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరించాలని తెలిపారు. పాఠశాలల భవనాలు, మూత్రశాలల మరమ్మతులతో పాటు కొత్తగా అవసరం ఉన్న చోట బాలికల కోసం మూత్రశాలల నిర్మాణం, విద్యుత్ సరఫరా తదితర పనులను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి పాఠశాల కమి టీ పేరిట బ్యాంకు ఖాతా తెరవాలని, ఇంజినీరింగ్ విభాగం అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి అభివృద్ధి పనుల అంచనా విలువతో ప్రతిపాదనలను రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం లోగా పనులను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి 'లక్ష్యం' పూర్తి

- 70.028 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీత
- 69.86 మిలియన్ టన్నులు రవాణా..
- రూ.37 వేల కోట్ల టర్నోవర్.., రూ.27 వేల కోట్ల లాభాలకు అవకాశం..
- ఏడు ఏరియాల్లో 100 శాతం టార్గెట్

సింగరేణి హెడ్డాఫీస్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 1 : సింగరేణి.. తమ ఉత్పత్తి లక్ష్యాన్ని 100 శాతం సాధించింది. పదేండ్లుగా ఏటేటా ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తూ రికార్డులు నెలకొల్పుతున్నది. గతేడాది 69.80 మిలియన్ టన్నులు.. 2023-24 ఆర్థిక సంవత్సరం 70.028 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. అమ్మకాలు, రవాణాలో కూడా ఆదే స్థాయిలో నిలిచింది. మొత్తంగా 69.86 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా చేసింది. ఓసీపీలో మట్టి తవ్వకాలు, రవాణా 420.32 మిలియన్ క్యూబిక్ మీటర్ల తీసింది. దీంతో ఈ ఏడాది 37 వేల కోట్ల టర్నోవర్‌తో సుమారు రూ.27 వేల కోట్ల లాభాలు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తున్నది.

7 ఏరియాల్లో 100 శాతం..

సింగరేణి వ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 7 ఏరియాలు 100 శాతం ఉత్పత్తిని అధిగమించాయి. సింగరేణిలో ఇల్లెందు ఏరియా 109 శాతం ఉత్పత్తితో మొదటి స్థానంలో నిలిచింది. కొత్తగూడెం, ఆర్జీ-3 ఏరియాలు 107 శాతం ఉత్పత్తితో రెండో స్థానాల్లో నిలిచాయి. మణుగూరు ఏరియాల్లో 106.., బెల్లంపల్లి.., ఆర్జీ-1 ఏరియాల్లో 103.., ఆర్జీ-2 ఏరియాలో 102 శాతం ఉత్పత్తి నమోదైంది. అలాగే మందమర్రి 91 శాతం.., శ్రీరాంపూర్ 89 శాతం.., ఆడ్రియాల 85 శాతం.., భూపాలపల్లి 73 శాతం తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

మంచిర్యాల ఏసీసీ : మాట్లాడుతున్న డీసీపీ అశోక్ కుమార్

ఎన్నికల నిబంధనలు పాటించాలి

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 1 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలని మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు, మైక్ పర్మిషన్ల కోసం సువిధ యాప్‌లో 48 గంటల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్, పట్టణ సీఐ బన్సీలాల్, రూరల్ సీఐ అశోక్ కుమార్, లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

కాసిపేట, ఏప్రిల్ 1 : కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. పెద్ద అరడిపెల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన..

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 1 : మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూములను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. భద్రతా సౌకర్యాలపై చర్చించారు. తీసుకోవాల్సిన అంశాలపై పోలీస్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట చెన్నూర్, కోటపల్లి సీఐలు రవీందర్, సుధాకర్ ఉన్నారు.

మున్సిపల్ ఏఈ, డీఈపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 2 : బెల్లంపల్లి మున్సిపాలిటీలోని వాహనాల కొనుగోలులో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఏఈ సందీప్, డీఈ మసూద్ అలీపై చర్యలు తీసుకోవాలని 20 మంది మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీడీఏంకు సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జేసీబీలు, 22 చెత్త సేకరణ ట్రాలీలు, రోడ్డు క్లీనర్, ఆల్‌ట్రేషన్ వాహనాను నాసిరకం కంపెనీల నుంచి తీసుకువచ్చారని, ఆ సంస్థల ప్రతినిధులతో లోపాయికారి ఒప్పందం చేసుకొని కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈ తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి బదిలీ కాకుండా ఇక్కడే ఉంటున్నాడని ఆరోపించారు. కరీంనగర్ మున్సిపాలిటీలో రెగ్యులర్‌గా చేస్తున్న డీఈ.. బెల్లంపల్లి లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారని తెలిపారు. ఇక్కడికి కౌన్సిల్ సమావేశాలకు తప్ప ఏ కార్యక్రమంలో నూ కనిపించడం లేదని విమర్శించారు. వీరిద్దరి నిర్లక్ష్యం కారణంగా రూ.7 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత కూరగాయల భవన నిర్మాణం నాలుగేళ్లుగా కొనసాగుతున్నదని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముల్కల నుంచి గోదావరి నీరు బెల్లంపల్లికి త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

అజ్గర్ అలీ (ఫైల్)

అదృశ్యమైన వ్యక్తి మృతి..

తాండూర్, ఏప్రిల్ 1 : అదృశ్యమైన వ్యక్తి మృతి చెందిన ఘటన తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరులోని సుభద్ర కాలనీకి చెందిన మహ్మద్ అజ్గర్ అలీ (33) ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆదివారం సమీప బంధువుల ఇండ్లల